క్లుప్తంగా

సముద్రాన్ని పరామర్శించిన తలారి



వాడపల్లిలో లంకదాసు సముద్రంను పరామర్శిస్తున్న తలారి తదితరులు

కొవ్వూరు: వాడపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఉపసర్పంచ్ లంకదాసు సముద్రంను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. మూడు రోజుల క్రితం పంజాబ్‌లో సముద్రం పెద్ద కుమారుడు యశ్వంత్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ సందర్భంగా యశ్వంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, అంతకు ముందు జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు తోట రామకృష్ణ, జిల్లా మాజీ యువజన విభాగం అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, ఇంటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు(అబ్బులు) తదితరులు సముద్రాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

మొక్కజొన్నలో పంట కోత ప్రయోగం

తాళ్లపూడి: వేగేశ్వరపురంలో డెక్వాల్ 9217 మొక్క జొన్న విత్తనం సాగు చేసిన పొలంలో పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. ఎ.కనకం అనే రైతు పొలంలో ఈ పంట కోత ప్రయోగం చేసినట్టు మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో మాట్లాడుతూ ఎకరాకు 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. వరిలో సరాసరి 45 బస్తాల దిగుబడి వస్తోందని పేర్కొన్నారు. ఈ ప్రయోగంలో రైతు సుధాకర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పోశమ్మ, గౌతమి పాల్గొన్నారు.

11 మంది ఉద్యోగాలకు ఎంపిక

నిడదవోలు : స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్, డైకిన్ ఏసీ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 11 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి తెలిపారు. ఇంటర్వ్యూలకు మొత్తం 18 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోచవరం పంచాయతీకి ట్రాక్టర్ అందజేత



ఠాగూర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అందజేసిన ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

తాళ్లపూడి: సామాజిక బాధ్యతగా తీసుకుని గ్రామస్తుల అవసరాలను తీర్చడం అభినందనీయం అని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పోచవరం గ్రామ పంచాయతీకి ఠాగూర్ ల్యాబొరేటరీస్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా చెత్త సేకరణ కోసం రూ.8.30 లక్షల విలువ గల ట్రాక్టర్‌ను అందజేసారు. బుధవారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోచవరం, రాగోలపల్లి, తుపాలకుల గూడెం అభివృద్ధికి ఠాగూర్ ఫ్యాక్టరీ యాజమాన్యం అందజేస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. సర్పంచ్ కాకర్ల హేమలత, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఠాగూర్ కంపెనీ యాజమాన్యం సుబ్రహ్మణ్యరాజు, రమేష్‌రాజు, విజయకుమార్‌రాజు, రాజశేఖర రాజు, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, ఎంపీపీ కాకర్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు.



గోపాలపురం మండలం భీమోలులో నేలకొరిగిన మొక్కజొన్న పైరు



వర్షానికి తడిసిన మొక్కజొన్న గింజలు



ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు



ధాన్యాన్ని బరకాలతో కప్పిన దృశ్యం

అకాల వర్షాలు.. ఆందోళనలో రైతులు

- ఈదురు గాలులతో కూడిన వర్షం జల్లులు
- తడిసి రంగుమారుతున్న ధాన్యం, మొక్కజొన్న
- అయినకాడికి అమ్ముకుంటున్న రైతులు
- నేల రాలిన మామిడి, జీడిమామిడి కాయలు



గోపాలపురం మండలం బుచ్చియ్యపాలెంలో రాలిన మామిడికాయలు



గౌరీపట్నంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

దేవరపల్లి: అకాల వర్షాలు, ఈదురు గాలులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా సాయంత్రం సమయంలో ఒకేసారి వాతావరణం మారడం, మబ్బులతో కూడిన బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు వర్షపు జల్లులు పడుతున్నాయి. దీంతో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న, ఎండుమిర్చి పంటలతో పాటు మామిడి, జీడిమామిడి పంటలకు అపారమైన నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడక్కడ ఉన్న మామిడి పిందెలు, జీడిమామిడి గింజలు నేలరాలినట్టు రైతులు తెలిపారు.

ఈదురు గాలులకు విరిగిపడిన హోర్డింగ్‌లు

మండలంలోని యర్నగూడెం, గౌరీపట్నం, దుద్దుకూరు, త్యాజంపూడి, కృష్ణంపాలెం గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడవడంతో రంగు మారినట్టు రైతులు తెలిపారు. తడిచిన ధాన్యం, మొక్కజొన్నను బుధవారం రైతులు ఆరబెట్టి ఒబ్బిడి చేసుకుంటున్నారు. కష్టాలు పడలేక కొంత మంది రైతులు ధాన్యం, మొక్కజొన్నను అయినకాడికి దళారులకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం సాయంత్రం మరలా బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షపు జల్లులు కురవడంతో రైతులు ధాన్యం రాసులపై బరకాలు కప్పి భద్రపర్చారు. దేవరపల్లిలో ఈదురు గాలులకు హోర్డింగ్‌లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడడం, తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి.

అన్నదాతలకు అపారనష్టం

గోపాలపురం: మూడు రోజులుగా భారీ ఈదురు గాలులు, వర్షాలకు మండలంలోని 262 ఎకరాల విస్తీర్ణంలో మొక్కజొన్న, 400 ఎకరాలల్లోని మామిడికాయలు రాలిపోయాయి. సోమ, మంగళ, బుధవారాల్లో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకూ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండలంలోని రైతాంగం పంటలపై ఆశలు వదులుకున్నారు. చేతికి అందివచ్చిన పంట వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల అకాల వర్షాలకు అపార నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాలపురం మండలంలోని భీమోలు 200 ఎకరాలు, కొవ్వూరుపాడులో 20 ఎకరాలు, సగ్గొండ 2, జగన్నాథపురం 11, సంజీవపురం15, గంగవరం 14 ఎకరాల్లోని మొక్కజొన్న పంట ఈదురుగాలులకు నేరకొరినట్లు వ్యవశాయ అధికారులు అంచనా వేశారు. మండలంలో మొత్తం 5వేల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. మొక్కజొన్న గింజ గట్టిపడే దశలో అకాల వర్షాలకు నేలకొరగడంతో దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గిపోతుందని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 62వేల ఎకరాల్లో మామిడి, జీడిమామిడి తోటలు ఉన్నాయి. అందులో 400 ఎకరాల్లో పంట మరో పదిరోజుల్లో చేతికి అందుతున్న తరుణంలో భారీ ఈదురుగాలుల కారణంగా మామిడి, జీడిమామిడి కాయలు పూర్తిగా నేలరాలాయని రైతులు తెలిపారు. అధికారులు పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా వేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అన్నదాతలను వణికిస్తున్న వాతావరణం

నిడదవోలు రూరల్: పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న దశలో బుధవారం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశంలో కారుమబ్బులు కమ్మేయడంతో పాటు నిడదవోలు మండలంలోని వివిధ గ్రామాల్లో ఈదురు గాలులు వీచాయి. కొన్ని చోట్ల కోత దశకు చేరిన వరిచేలు నేలకొరిగాయి. ఈ పరిణామం అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. ఈదురుగాలుల ప్రభావంతో మండలంలోని సమిశ్రగూడెం, డి.ముప్పవరం, కలవచర్ల తదితర గ్రామాల్లో విద్యుత్ కోత విధించారు. సుమారు 3 గంటలు పైగా విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

కొవ్వూరు: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేయించి దోషులను శిక్షించాలని కోరుతూ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో కొవ్వూరు పట్టణంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. వందల సంఖ్యలో క్రైస్తవులు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు. మెరకవీధి సెంటర్ నుంచి స్టాండ్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించింది.పాస్టర్స్ ప్రతినిధి ఎస్.ఎడ్వర్డ్ మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మరణంపై క్రైస్తవులందరికీ ఎన్నో అనుమానాలున్నాయన్నారు.వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు ఉపశమనం

తాళ్లపూడి: అధికలోడు విద్యుత్ వాడుతున్న, కావాల్సిన గృహ విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రత్యేక అవకాశాన్ని కల్పించిందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కేవలం 50 శాతం మాత్రమే డవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేస్తారని, గృహాలకు అధిక లోడు వాడుతున్న వినియోగదారులకు ఇది ఉపశమనం కలిగిస్తుందని అన్నారు. గతంలో ప్రతి అదనపు కిలో వాట్‌కు గతంలో డవలప్‌మెంట్ చార్జీ రూ.2 వేలు, సెక్యూరిటీ డిపాజిట్ రూ. 200, అప్లికేషన్ ఫీజు రూ.50 కలిపి మొత్తం రూ.2,250 చెల్లించాల్సి వచ్చేదని ప్రస్తుతం 50 శాతం రాయితీ ఇవ్వడం వల్ల డవలప్‌మెంట్ చార్జీ రూ.1000, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, అప్లికేషన్ ఫీజు రూ. 50 కలిపి ప్రతి అదనపు కిలో వాట్‌కు కేవలం రూ.1,250 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు వలంటరీగా ముందుకు వచ్చి అదనపు లోడు విద్యుత్ వినియోగాన్ని క్రమబద్ధీకరించు కావాలని ఏఈ కోరారు.

గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



ఉండ్రాజవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అయేషాఖాన్

ఉండ్రాజవరం : గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. పీఎం సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉండ్రాజవరం పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన నిస్సా హాస్పిటల్ స్త్రీ ప్రసూతి వైద్య నిపుణుడు అయేషా ఖాన్ గర్భిణులకు పరీక్షలు చేసి తగు సూచనలు అందజేసారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ పథకంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హైరిస్క్ ఉన్న వారిని గుర్తించి, వారికి అవసరమైన చికిత్స అందిస్తామన్నారు. పీహెచ్‌సీలో ప్రసవించిన తల్లులకు జననీ సురక్ష యోజనలో రూ.1,000 పోషకాహారం నిమిత్తం లబ్ధిదారుల అకౌంట్‌కు జమ చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రమణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, పర్యవేక్షకుడు జిన్నూరి శ్రీనివాసు, నర్సు సంధ్య, మహిళ ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పరమతాన్ని విమర్శించొద్దు

- మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు పాల్‌రాజ్



నందిగూడెం చర్చిలో సమావేశమైన పాస్టర్లు

గోపాలపురం: పరమతాన్ని గౌరవించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విమర్శించడం తగదని మండల పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడు పాల్‌రాజ్ అన్నారు. గోపాలపురం మండలం నందిగూడెం ప్రార్థనా మందిరంలో బుధవారం పాస్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాల్‌రాజ్ మాట్లాడుతూ, క్రైస్తవులంతా ఐక్యంగా ఉంటే, ఎటువంటి దుష్టశక్తులు దాడులు చేయలేవన్నారు. భారతీయులంతా సమానమే అన్న భావనతో, ఇతర మతాలను గౌరవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు తలారి తిమోతి, డి.నిరీక్షణ్ నిర్మల్‌కుమార్, దండే బ్రెన్‌హోం, కరుణాకర్, తానేటి రాజు తదితరులు పాల్గొన్నారు.

మరియమ్మకు ఆర్థికసాయం అందజేత



మరియమ్మకు నిత్యావసర వస్తువులు అందజేస్తున్న మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చాగల్లు: చాగల్లు భవిత కేంద్రంలో ఆయాగా పనిచేస్తున్న మరియమ్మకు బుధవారం చాగల్లు–కొవ్వూరు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు, నగదు సహాయం అందజేశారు. మరియమ్మ కుమారుడు దివ్యాంగుడు ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో ఎన్ఆర్ఐ మోతుకూరి కాశీ విశ్వేశ్వరరావు రెండు నెలలకు సరిపడా బియ్యం, వంట నూనె, పప్పు దినుసులు తదితర నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విశ్రాంత ఎంఈవో కోడినాగేశ్వరరావు రూ.500 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జుజ్జవరపు ప్రసాద్, మానవత డైరెక్టర్ ఆళ్ల వీరవెంకటసత్యనారాయణ పూర్ణిమ టీచర్ దంపతులు పాల్గొన్నారు.

గజ్జరంలో భూముల రీ సర్వేపై గ్రామసభ



గజ్జరంలో భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లపూడి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గజ్జరంలో ఈ నెల 11వ తేదీ నుంచి భూముల రీ సర్వే ప్రారంభిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి తెలిపారు. మండలంలోని గజ్జరం సచివాలయం వద్ద సర్పంచ్ గండి రాంబాబు అధ్యక్షతన భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ మోహనభారతి పలు అంశాలను తెలియజేసారు. ఈ సందర్భంగా డీఎస్ఎల్‌వో లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రీ సర్వే సమయంలో రైతులు తమ పాస్‌బుక్‌లు, భూమి పత్రాలు, ఆధార్‌కార్డు అందుబాటులో ఉంచుకుని సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. రైతులకు ఎదురయ్యే అనుమానాలను నివృత్తి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రీ సర్వేకి చెందిన అధికారులు డీఐ వేంకటేశ్వరరావు, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఎంపీటీసీ గుంటు చిన్నబ్బాయి, వీఆర్వోలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలి



అంగన్‌వాడీ సెంటర్ నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

గోపాలపురం: అంగన్‌వాడీ సెంటర్ నుంచి ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థులను చేర్పించినట్టు పాఠశాల హెచ్‌ఎం ఇస్సాపురి కృష్ణయ్య తెలిపారు. బుధవారం చిట్యాల అంగన్‌వాడీ సెంటర్ నుంచి 5 సంవత్సరాలు పూర్తయిన విద్యార్థులను పాఠశాలలో చేర్పించినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె కుంతీదేవి, సీఆర్‌పీ కె.నాగరాజు, ఉపాధ్యాయులు గుబ్బా శ్రీనివాసరావు, చాపల సూర్యచంద్రం, టి. చినదోశయ్య పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలి

ఉండ్రాజవరం: గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలుండే ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మండలంలో తాడిపర్రులో అంగన్‌వాడీ సెంటర్‌లో గర్భిణులు, బాలింతలు, తల్లులకు, కిషోర బాలికలకు అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. చంటి పిల్లల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు హాజరయ్యారు.

వైభవంగా మన్యు పాశుపత హోమం



నల్లజర్లలో మన్యు పాశుపత హోమం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ హోంమంత్రి తానేటి వనిత

నల్లజర్ల: లోక కల్యాణార్థం నల్లజర్ల శ్రీ రామకృష్ణ భక్త మందిరంలో 49 రోజులుగా కొనసాగుతున్న సప్త, సప్తాహ హనుమాన్ చాలీసా పారాయణ ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకం, గంగ సిందూర పూజ, మన్యు పాశుపత హోమం వేద పండితులు బ్రహ్మశ్రీ నందుల ఆంజనేయశర్మ, సామవేదం నగేష్ శర్మ, గొడు మణికంఠసాయి ఆధ్వర్యంలో నిర్వహించారు. వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం దంపతులు పూజలు నిర్వహించారు. గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మాజీ హోంమంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా హాజరై హోమ పూజల్లో పాల్గొన్నారు. నాయకులు బంక అప్పారావు, వామిశెట్టి పరమేశ్వరావు, ఎంపీటీసీ మేణ్ని వెంకటలక్ష్మి, వల్లూరి శేషగిరి, రాయుడు విజయకుమార్, మద్దూరి నాగేశ్వరావు, అచ్యుత వెంకటస్వామి, మేణ్ని యువరాజు తదితరులున్నారు.ఈ సందర్భంగా 2వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



మారెళ్ళమూడిలో నవధాన్యాల విత్తన కిట్లు రైతులకు అందజేస్తున్న అధికారులు

నల్లజర్ల: సహజ సిద్ధంగా భూసారం పెంపొందించడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రకృతి వ్యవసాయ విభాగం పని చేస్తోందని మండల వ్యవసాయాధికారి కె.కమల్ రాజ్ అన్నారు. మారెళ్ళమూడిలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో తయారు చేసిన నవధాన్యాల విత్తన కిట్లను బుధవారం ఆయన రైతులకు అందజేశారు. మాష్టర్ ట్రైనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 500 కిట్లు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కిట్లలో 18 రకాల విత్తనాలు ఉంటాయన్నారు. ఖరీఫ్ సాగుకు ముందు భూమి దున్ని నవధాన్యాలు వేసి పచ్చిరొట్టగా పెంచుకోవడం ద్వారా భూమి సారవంతమవుతుందన్నారు. ప్రధాన పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం, పొటాష్, ఇతర అన్నిరకాల పోషకాలను భూమి వృద్ధి చేసుకుంటుందన్నారు. పంట నీటి ఎద్దడిని తట్టుకుంటుందన్నారు.తెగుళ్ళ బెడద, కలుపును అరికట్టడం ద్వారా పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. ఒక్కో కిట్టు రూ.800 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం తాతారావు, యూనిట్ ఇన్‌చార్జిలు మారెంకనకదుర్గ, కోటేశ్వరీ, ప్రసాద్, ఐసీఆర్‌పీఎస్‌లు నరసింహరావు, ఉమాదేవి, వినయ్, దుర్గాప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

గ్యాస్ ధరల పెంపుపై నిరసన



నిడదవోలులో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నిడదవోలు : కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచటం ద్వారా దేశ ప్రజలపై పెను భారం మోపిందని, తక్షణమే పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మహిళలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చటానికే కేంద్రం ప్రజలపై ధరల భారం మోపిందని విమర్శించారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తక్కువగా ఉన్న సమయంలో గ్యాస్ పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే అవకాశం ఉన్నా, కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చటమే లక్ష్యంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వ పని చేస్తోందన్నారు. తక్షణమే గృహ వినియోగదారుల గ్యాస్‌పై పెంచిన రూ.50 తక్షణమే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి. నాని,నాగమణి, గంగ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముడి ఊరేగింపు



దేవరపల్లిలో కోదండరాముడిని రథంపై ఊరేగిస్తున్న రామభక్తులు

దేవరపల్లి: దేవరపల్లిలో వేంచేసిన కోదండరాముడిని బుధవారం గ్రామంలో రామభక్తులు వైభవంగా ఊరేగించారు. సీతారామలక్ష్మణులను రథం ఉంచి వీధుల్లో ఘనంగా ఊరేగించారు. రామనామస్మరణతో వీధులు మార్మోగాయి. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉనకరమిల్లిలో నేడు స్వామివారి ఊరేగింపు

నిడదవోలు రూరల్: ఉనకరమిల్లిలో సీతారామ కల్యాణ మహోత్సవాలు, 83వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారిని ఊరేగిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈనెల 13న ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

గురుకులాలకు 13న ప్రవేశ పరీక్ష

గోపాలపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు ఈ నెల 13న ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ కె.రాజేశ్వరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి 12 వరకూ ఐదో తరగతి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకూ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com

శ్రీ రాజా కాండ్రేగుల జోగి జగన్నాథరావు పంతులు బహద్దూర్ వారి అన్నదాన సత్రము

(శ్రీ ఫీడింగు సత్రం), దేవదాయ ధర్మదాయ శాఖ, రాజానగరం, తూ.గో.జిల్లా.

భూమి కౌలు హక్కు బహిరంగ వేలం ప్రకటన

పై సత్రం తాలూకు ఈ దిగువ తెలియపరిచిన భూమిని 3 సంవత్సరముల కాలపరిమితికి అనగా 2025-2026 నుండి 2027-2028 సంవత్సరం వరకు కౌలుకు ఇచ్చుటకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో బహిరంగ వేలం పాటలు నిర్వహించబడును.

వ. నం.	భూమి గల గ్రామం	సర్వే నెంబరు, విస్తీర్ణం	బహిరంగ వేలం నిర్వహించు తేదీ, సమయం, ప్రదేశం	ధరావత్తు సొమ్ము రూ.	సాల్వెన్సీ రూ.
1	త్యాజంపూడి (గ్రా), దేవరపల్లి (మం) తూ.గో.జిల్లా	387/1, 378/2 ఎ.12.93 లు	త్యాజంపూడి గ్రామ సచివాలయం వద్ద, ది.24.04.2025, ఉదయం గం.11.00 నుండి	25,000	6,00,000
2		278/2 ఎ.2.00 లు		8,000	2,00,000
3		385 ఎ.3.00 లు		20,000	3,00,000

ముఖ్య షరతులు 1) ఈ బహిరంగ వేలం పాటలలో పాల్గొనదలచిన వారు ముందుగా నిర్ణయించిన ప్రథమ ధరావత్తు చెల్లించి, ఆధార్ కార్డు సమర్పించి, పాటలలో పాల్గొనవలెను. 2) పాట షరతులు, నియమ నిబంధనలు సత్రం కార్యాలయం పని చేయు వేళలలో స్వయంగా గానీ, ఫోన్ 9959162488 ద్వారా గానీ అడిగి తెలుసుకొనవలెను.

కార్యనిర్వహణాధికారి